నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బాలానగర్, నవంబర్ 26 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓల్డ్‌బోయిన్‌పల్లి ఫీడర్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్, మల్లికార్జునకాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, యాదవ బస్తీ, సాయి కృష్ణకాలనీ, రమ్య దవాఖాన ఎదురుగా, బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్, చత్రిగడ్డ, గంగపుత్ర సంఘం, మల్లికార్జునకాలనీ, మెయినటరీ స్కూలు, భాగ్యశ్రీ గార్డెన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హస్మత్‌పేట ఫీడర్ పరిధిలోని హస్మత్‌పేట, ముస్లింబస్తీ, లయన్స్‌టౌన్‌కాలనీ, అబ్రార్‌నగర్, ట్రినిటీ టవర్స్, ఎస్ఎస్ రెసిడెన్స్, సూర్య ఎన్‌క్లేవ్, జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్, సత్య ఆర్కేడ్, ఎమ్‌రాల్డ్ లేక్ రెసిడెన్సీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

జగద్గిరిగుట్ట : మరమ్మతుల కారణంగా చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు. భగత్‌సింగ్ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. చంద్రానగర్, భగత్‌సింగ్ నగర్, దుర్గానగర్, స్ఫూర్తి నగర్, రంగా నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించే అవకాశం ఉందని దుండిగల్ ఎస్ఐ శంకర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని హనుమాన్ ఆలయంలోఆలయ నిర్వాహకులైన సగ్గిడి శ్రీనివాస్, సగ్గిడి నర్సింగ్‌రావు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా మంగళవారం వాటిని ప్రారంభించారు.

- దుండిగల్

పథకాల విషయంలో రాజకీయాలు వద్దు



కూకట్‌పల్లి తాసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, తాసీల్దార్ స్వామి



షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, తాసీల్దార్ స్వామి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 26 : సంక్షేమ పథకాలను అందించడంలో రాజకీయాలు చేయడం తగదని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎప్పడికప్పడు పంపిణీ చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. చెక్కుల పంపిణీపై కాలయపనపై ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తానని ఎమ్మెల్యే కృష్ణారావు హెచ్చరించడంతో అధికారులు స్పందించి.. మంగళవారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కేపీహెచ్‌బీ కాలనీలోని కూకట్‌పల్లి తాసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలు హాజరై.. 534 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలో పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు వచ్చి నెలరోజులు అవుతున్నా...ఆ చెక్కులను పంపిణీ చేయడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులను ప్రశ్నించినందువల్లే... ఈ రోజు చెక్కులను పంపిణీ చేస్తున్నారని, భవిష్యత్‌లో చెక్కుల పంపిణీ చేయడానికి కాలయాపన చేయకుడదని అధికారులను కోరారు. పేదలకు చెందిన సంక్షేమ పథకాలలో రాజకీయాలు చేయడం తగదని, వాట్సప్ గ్రూప్‌లలో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. గతంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆడబిడ్డల తల్లిదండ్రులకు చక్కటి భోజనం పెట్టి... చెక్కులను అందించేవారమన్నారు. కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేస్తే బాగుంటుందన్నారు. చెక్కుల పంపిణీలో భోజనం పెట్టందుకు అవకాశం కల్పించాలని అధికారులను కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు... కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో ఆర్థిక సాయంతోపాటుగా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ కండువాలు.. ఫ్లెక్సీల ఏర్పాటుపై రగడ

కూకట్‌పల్లి మండల కార్యాలయంలో తాసీల్దార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కండువాలతో రావడాన్ని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ కండువాలు ఎలా వేసుకుంటారని. పార్టీ కండువాలు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆఫీస్ ఎదుటు కాంగ్రెస్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై అగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండల అధికారులు అధికారికంగా నిర్వహించే కార్యక్రమానికి రాజకీయరంగును పులుమడం సరికాదని, కాంగ్రెస్ నాయకుల తీరుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు.. మాధవరం కృష్ణారావు జిందాబాద్ అని... కాంగ్రెస్ నాయకులు పట్నం మహేందర్‌రెడ్డి జిందాబాద్ అని.. నినాదాలు చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతవరణం నెలకొన్నది. కాగా... ఇరు పార్టీల అధినాయకులు కల్పించుకుని... జిందాబాద్‌లు వద్దని వారించడంతో అన్ని పార్టీల నాయకులు వెనక్కితగ్గారు. చివరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

నిరుపేదలకు పథకాలు చేయూత

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు చేయూత అందిస్తున్నాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బాలానగర్ తాసీల్దార్ కార్యాలయం వద్ద తాసీల్దార్ శ్రీనివాస్‌రావు తో కలిసి 208 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం అని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల ఆత్మ బంధువు అని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ నాగమణి, కార్పొరేటర్లు ముద్దం నర్సింహ యాదవ్, పండాల సతీశ్ గౌడ్ పాల్గొన్నారు.

- బాలానగర్

నూతన సంక్షేమ భవనం నిర్మించాలి

మోతీనగర్ పరిధిలోని కబీర్‌నగర్ సంక్షే మ సంఘం భవనం శిథిలావస్థకు చేరుకున్నది. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో గోడలు బీటలు వారాయి. మధ్యలో రావిచెట్టు మొలిచింది. భవనంలో బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోసెఫ్ కెరీటన్ కోరుతున్నారు.

- అల్లాపూర్

దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

దుండిగల్ : దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని పురపాలక చైర్‌పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణికృష్ణ అన్నారు. మంగళవారం గండిమైసమ్మలోని మున్సిపాలిటీ కార్యాలయంలో పురపాలక చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పెండింగ్ పనులను పూర్తి చేయుటకు కౌన్సిల్ సభ్యులతో పాటుగా ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఓ ప్రభాకర్‌ని కౌన్సిల్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, గండిమైసమ్మ – దుండిగల్ తాసీల్దార్ మతీన్, మున్సిపాలిటీ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, కుంటి అరుణనాగరాజు, అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల కృష్ణాయాదవ్, జక్కుల విజయ శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్, సాయి యాదవ్, మహేందర్ యాదవ్, నవనీత మల్లేశ్, ఎల్లుగారి సత్యనారాయణ,భరత్ కుమార్, పీసరి బాలమణి క్రిష్ణరెడ్డి, మౌనిక విష్ణువర్ధన్‌రెడ్డి, మాదాస్ వెంకటేశ్ , కొర్ర శంకర్ నాయక్, జోస్పిన్ సుధాకర్‌రెడ్డి, ఏఈ సరేందర్ నాయక్, మేనేజర్ సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్యసమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ శంభీపూర్‌క్రిష్ణవేణికృష్ణ, కమిషనర్ సత్యనారాయణరావు, తాసీల్దార్ మతిన్

దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ అధ్వర్యంలో ఈనెల 29 నిర్వహించ తలపెట్టిన దిక్షా దివస్ రంగారెడ్డి జిల్లా సన్నాహాక కార్యక్రమం శంషాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. మహేశ్వరం శాసన సభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి, మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

- శేరిలింగంపల్లి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేద్కర్ విగ్రహం వద్ద.. వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం సర్వమతాలు, కులాలకు పవిత్రమైన గ్రంథమన్నారు. 140 కోట్ల జనాభా కలిగిన దేశాన్ని ప్రజాస్వామ్య పద్ధతి, స్వేచ్ఛాయుత వాతావరణంలో పరిపాలించగలుగుతున్నామంటే మన రాజ్యాంగం గొప్పదనమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాహుల్‌నాయక్, చంద్రశేఖర్, చందన, సుశ్రుత, అర్జున్‌గౌడ్, రోహిత్, అ నిష్, ప్రపుల్, కాశీ, గగన్, హరినాథ్, ఫా ల్గుణ, సుజయ్, గణేశ్, సాత్విక్ పాల్గొన్నారు.

కొండాపూర్ : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కొండాపూర్‌లోని 8వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ సీ సన్నీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

వైద్య ఖర్చుల సాయాన్ని అందిస్తున్న రవిసింగ్

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 26 : కార్మికులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డ్ గ్రహీత రవిసింగ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ పారిశ్రామిక వాడలో ఫ్లైవుడ్ సప్లయర్స్ షాప్‌లో యాదగిరి పని చేస్తుండగా.. అతడి చేతివేళ్లకు గాయమైంది. షాపు నిర్వాహకుడు అబ్దుల్ గఫర్ ఖాన్ వైద్యం చేయించడానికి నిరాకరించాడు. బాధిత కార్మికుడు కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్‌ను ఆశ్రయించగా.. వెంటనే షాపు నిర్వాహకుడితో మాట్లాడి.. వైద్య ఖర్చులకు గాను రూ. 45 వేలు ఇప్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

దృష్టి మరల్చి బంగారు గొలుసు చోరీ మహిళ అరెస్ట్.. గొలుసు స్వాధీనం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 26 : కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ జూవెలర్స్ షాపులో సెల్స్‌మెన్ దృష్టి మరల్చిన ఓ మహిళా.. బంగారు గొలుసును తస్కరించగా.. పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నం.1లోని దేవి జూవెలర్స్‌లోకి 23న గుర్తు తెలియని మహిళ మాస్క్ ధరించి ప్రవేశించిం ది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేస్తానని బేరాలు మొదలు పెట్టింది. ధర, డిజైన్‌ను అడుగుతూ అక్కడే కూర్చుంది. సెల్స్‌మెన్‌ను బురిడీ కొట్టి.. 73.916 గ్రాముల (రూ.2.90 లక్షల విలువైన) బంగారు గొలుసు (నెక్లెస్) తీసుకొని పారిపోయింది. ఈ ఘటనపై షోరూం మెనేజర్ రాకేష్ సియమ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా... మియాపూర్‌లోని గోకుల్‌టవర్స్‌లో నివసించే పుట్ట సునితా గొలుసును దొంగిలించినట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి 8 గంటలకు ఆమెను అరెస్ట్ చేసి... దొంగిలించిన గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

సెయింట్ మార్టిన్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

కుత్బుల్లాపూర్ : దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఐఆర్‌సీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జె.ఆర్.సి.వై.ఆర్.సి. రాష్ట్ర కన్వీనర్ డా.రమేశ్, కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్ కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు ఐక్యమత్యంగా ముందుకు వచ్చి 330 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణపాయ పరిస్థితిలో ప్రమాదంలో గాయపడిన సమయంలో అత్యవసర సమయంలో రక్తం అవసరం చాలా ఉంటుందన్నారు. ప్రాణాలను రక్షించి మానవత్వాన్ని చాటుకోవడానికి విద్యార్థులు సైనికుల్లా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

శిబిరంలో పాల్గొన్న సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఐఆర్‌సీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, జె.ఆర్.సి.వై.ఆర్.సి. రాష్ట్ర కన్వీనర్ డా.రమేశ్, కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి

శేరిలింగంపల్లి : అధిక పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకున్నపుడే రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని మియాపూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వసుంధర అన్నారు. జనహిత సేవాట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించారు. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

హెచ్ఎం మాట్లాడుతూ.. ఆకుకూరలు, గుడ్లు, పాలు, పండ్లు , పౌష్టక ఆహారాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా బాలికలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నర్సింగ్‌రావు, సరితారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

అలరించిన..సంగీత్ సమారోహ్

మాదాపూర్, నవంబర్ 26 : సంగీత్ సమారోహ్‌లో గాత్ర కచేరి సందర్శకులను విశేషంగా అలరించింది. మాదాపూర్‌లోని సీసీఆర్‌టీలో మంగళవారం పండిత్ జస్‌రాజ్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 52వ పండిత్ మోతీరామ్ పండిత్ మనిరామ్ సమారోహ్ – 2024 అట్టహాసంగా జరిగింది. మూడోరోజు స్వర్ శర్మ మనోహరమైన హిందుస్థానీ గాత్ర ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. ప్రముఖ గాయకుడు లెజండరీ పండిత్ వసంతరావు దేశ్ పాండే మనువడు రాహుల్ దేశ్ పాండే అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఖయల్, నాట్య సంగీతం, తుమ్రీ క్లాసికల్, సెమీ క్లాసికల్ కలయికతో గాత్రాన్ని ఆలపించారు. కార్యక్రమానికి మాజీ డీజీపీ అంజనీకుమార్, పలువురు ప్రముఖులు విచ్చేశారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు

దుండిగల్, నవంబర్ 26 : భార్యను వేధింపులకు గురిచేసి, ఆత్మహత్యకు కారకుడైన ఓ భర్తకు కోర్టు మూడేండ్ల జైలు శిక్షను విధించింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా, హత్నూరకు చెందిన సుంకు సాంత(36), లక్ష్మణ్ దంపతులు. వీరు వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్‌లో నివాసముంటూ భిక్షాటన చేస్తూ జీవించేవారు. మూడేండ్ల కిందట అనగా.. 2022 జనవరి 14వ న చికెన్ వండే విషయంలో దంపతుల మధ్య గొడవ చోటుచేసుకున్నది. కొంత సేపటి తర్వాత ఇంట్లోని డిష్‌టీవీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా.. తన భార్యే ఇలా చేసి ఉంటుందని భావించిన లక్ష్మణ్ భార్యతో మరోమారు గొడవపడి తీవ్రంగా దూషించాడు. విసుగుచెందిన ఆమె ఇంట్లో ఎవరులేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నది. మంటలు తాళలేక బయటకు పరుగుతీగా.. గుర్తించిన ఆమె కొడుకు స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేసి చికిత్స నిమిత్తం ఉస్మానియా వైద్యశాలకు తరలించాడు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ అదే నెల 19న తుది శ్వాస విడిచింది. మృతురాలి కూతురు బాజా మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నిందితుడైన లక్ష్మణ్‌ను దోషిగా నిర్ధారిస్తూ మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.500 నగదు జరిమానా విధించింది. ఒకవేళ నగదు జమ చేయని పక్షంలో మరో నెలరోజుల సాధారణ శిక్షను అమలు చేయాలని తీర్పునిచ్చినట్లు దుండిగల్ పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు.. గురువుల పాత్ర కీలకం

మాదాపూర్, నవంబర్ 26: సీనియర్ సీడ్స్ ప్రైమరీ, సీడ్స్ ఏరియన్ క్యాంపస్ సంగమం వార్షికోత్సవాన్ని అడ్వెంచర్స్ ఇన్ ది వండర్లాండ్ థీమ్ పేరుతో మియాపూర్‌లోని విశ్వనాథ్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ అశోక్ చక్రవర్తి విచ్చేసి సీనియర్ సీడ్స్ ప్రైమరీ సంస్థ చైర్మన్ పాండు రంగా చారి, ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర ప్రసాద్, అకాడమిక్ హెడ్, డాక్టర్ జయశ్రీ నాయర్‌తో కలిసి కార్యక్రమాన్ని పారంభించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ ... విద్యార్థుల జీవితంలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్స్ గరిమా కుమార్, నగవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.